క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

చింతకాని: గ్రామస్థాయి అధికారులు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని బొప్పారం గ్రామంలో వైకుంఠ ధామం, పల్లెప్రకృతి వనం, నర్సరీ, క్రీడా ప్రాంగణం, డంపింగ్ యార్డులను శనివారం ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీకి సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివశంకర్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూనిఫాం తొలిరోజే..

ఏన్కూరు: పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాం అందించడం జరుగుతుందని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కూరకుల సైదయ్య తెలిపారు. విద్యార్థుల దుస్తులు కుడుతున్న కేంద్రానికి వెళ్లి శనివారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు రాఘవారావు, పుల్లయ్య, సీఆర్పీ కృష్ణ ప్రసాద్, టైలర్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో డబ్బులు ఇచ్చే విషయంలో శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య వివాదం జరిగింది. దీనికి సంబంధించి ఉసికల రామారావుపై అదే గ్రామానికి యాదగిరి, ఉపేందర్, బాలకృష్ణ అను ముగ్గురు వ్యక్తులు కలిసి కాంటా రాయితో దాడి చేయగా.. గాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ముదిగొండ: ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపాన శనివారం మేతకు వెళ్లిన ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో షాక్‌కు గురై మృతిచెందింది. ఆవు విలువ రూ.80వేల మేర ఉంటుందని యజమాని పానుకుల సుధాకర్ తెలిపారు. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉందని పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయాడు. ఘటనాస్థలాన్ని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు, పశువైద్యాధికారి అశోక్ పరిశీలించి వివరాలు ఆరా తీశారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

బోనకల్: మండల కేంద్రంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న బాల్‌బ్యాడ్మింటన్ వేసవి శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. 33మంది క్రీడాకారులు ఈ శిబిరంలో నెల రోజులుపాటు శిక్షణ పొందారు. వీరిలో ఐదుగురిని ఉత్తమ క్రీడాకారులుగా గుర్తించి బహుమతులను అందించారు. త్వరలో జరగనున్న సబ్‌జూనియర్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు సీనియర్ క్రీడాకారులు సీహెచ్ జగదీష్, పి.ఉపేందర్, బి.గోపి, సీహెచ్ ఖాదర్ తెలిపారు.

సింగరేణి ఉచిత వైద్యశిబిరం

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం ఓసీ ప్రభావిత, పరిసర గ్రామాల్లో మౌళిక సౌకర్యాల్లో భాగంగా కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు ఆదేశాల మేరకు శనివారం కిష్టారం అంబేడ్కర్‌నగర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని కిష్టారం పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారావు ప్రారంభించారు. సింగరేణి వైద్యురాలు డాక్టర్ శిరీష రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, ఎంపీటీసీ సునీత రాజు, మాజీ సర్పంచ్ రేణుక ఈశ్వర్, సంక్షేమాధికారి సందీప్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు వితరణ

వైరా: దిశ పర్పుల్ డీఎస్‌ఏ సొసైటీ సహకారంతో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన ఇద్దరు మహిళలకు శనివారం కుట్టుమిషన్లు వితరణగా అందజేశారు. డీఎస్‌ఏ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాసరావు ఆర్థికసాయంతో వైరా మండలం స్నానాల లక్ష్మీపురానికి చెందిన మేరీ, తాటిపూడికి చెందిన కరుణకు కుట్టుమిషన్లు అందించగా.. లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావుతో పాటు చౌడవరపు బద్రీనాథ్, అబ్బూరి రమేష్, చింతలపూడి వెంకటేశ్వరరావు, వనమా చిన్ని తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

ఏన్కూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం కోరారు. శనివారం మండలంలో నిర్వహించిన సీపీఎం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, బాలాజీ, రాములు, లెనిన్, జానీ, శ్రీనివాసరావు, వెంకటయ్య, కృష్ణారావు, నర్సింహారావు, కృష్ణయ్య, వేణు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత..

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన ఆరుగురు కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇద్దరు పిల్లలు ప్రమాదం నుంచి బయటపడ్డారు. వారికి మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత శనివారం నల్లమల కౌశిక్, కార్తీక్‌లకు రూ.5వేల రూపాయలను వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జై.. హనుమాన్


బోనకల్: ఆంజనేయ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

జై హనుమాన్.. జైజై హనుమాన్.. జై శ్రీరాం.. జైజై శ్రీరాం.. నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. హనుమత్ జయంతి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో స్వామివార్లకు అభిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణాలు, ఆకుపూజలు నిర్వహించారు. అర్చకులు హనుమాన్ జయంతి విశిష్టతను వివరించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు గ్రామాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్త బృందం సభ్యులు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


వైరా: ఆంజనేయస్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు


సత్తుపల్లిరూరల్: రాజీవ్‌నగర్‌లో..


వైరారూరల్: కొండకొడిమలో..


కల్లూరు: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


కారేపల్లి: సీతారాంపురం గ్రామంలో..


సత్తుపల్లిరూరల్: ఆలయంలో పూజలు చేస్తున్న బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు


ఎర్రుపాలెం: అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు


ముదిగొండ: వెంకటాపురం ఆలయంలో..


కొణిజర్లలో..


అంజనాపురం దేవాలయానికి శోభాయాత్రగా వెళ్తున్న భక్తులు


అంజనాపురం దేవాలయంలో..

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

తల్లాడ: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. మండలంలోని నారాయణపురం కోదండ రామాలయం నుంచి హనుమాన్ జెండాలతో వేలాది మందిగా భక్తులు కాలినడకన తల్లాడ మీదుగా అంజనాపురం దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌పై భారీ ఆంజనేయ చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


మధిర: విశేషాలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి


ముదిగొండ: వెంకటాపురం ఆలయంలోని దాసాంజనేయస్వామి


పెనుబల్లి: వీయంబంజర్‌లో.. అభయాంజనేయస్వామి


చింతకాని: మత్కేపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో..


కల్లూరురూరల్: పుల్లయ్య బంజరు రామాలయంలో హనుమాన్ చాలీసా పఠిస్తున్న భక్తులు


ఏన్కూరులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సంతగుడికి తాళాలు.. భక్తుల ఇబ్బందులు


కారేపల్లి సంతగుడి బయట నుంచే పూజలు చేస్తున్న భక్తులు

కారేపల్లి: దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కారేపల్లిలోని వేంకటేశ్వరస్వామి (సంతగుడి) దేవస్థానం, ఆంజనేయస్వామి గుడికి సిబ్బంది తాళాలు వేసి వెళ్లిపోవటంతో.. భక్తులు మొక్కులు చెల్లించేందుకు ఇబ్బందులు పడ్డారు. హనుమాన్ జయంతి సందర్భంగా.. శనివారం ఉదయమే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. కాగా.. ఆలయానికి తాళాలు వేసి ఉండటం, పూజారి, దేవాదాయ శాఖ సిబ్బంది అందుబాటులో లేకపోవటంతో.. గుడికి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించేందుకు అసౌకర్యానికి గురయ్యారు. నెల నెలా దేవాదాయ శాఖ నుంచి వేలకు వేలు జీతాలు తీసుకుంటున్న సిబ్బంది, ఆలయ బాగోగులు చూసుకోకపోవటంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వందేళ్ల చరిత్ర ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపదూపనైవేధ్యాలు కరువైయ్యాయని, ఇప్పటికైనా దేవాదాయధర్మదాయ శాఖ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. దీనికి సంబంధించి ఆలయ ఈఓ శేషయ్యను వివరణ అడిగేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

‘దేశంలో ఇండియా కూటమిదే అధికారం’


మాట్లాడుతున్న సుదర్శన్

వైరా: దేశ వ్యాప్తంగా 7 విడతలుగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి మెజార్టీ స్థానాలు సాధించి అధికారంలోకి రాబోతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. శనివారం వైరా బోడేపూడి భవన్‌లో చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన నిర్వహించిన వైరా పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, నాయకులు మచ్చా మణి, బొంతు సమత, అనుమోలు రామారావు, సుధాకర్, నరసయ్య, మోహనరావు, నరసింహారావు, బత్తిరన్న, రజిత పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు ముగ్గురి ఎంపిక


భూక్యా విగ్నేష్


ఫిలిప్‌వర్మ


శ్రీహర్ష

కల్లూరు: వరంగల్ జిల్లా అశోక్‌నగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ సందర్భంగా కల్లూ కాకతీయ షుగర్స్ కాలనీకి చెందిన భూక్యా విగ్నేష్, కల్లూరు మండలం వాచ్యానాయక్ తండాకు చెందిన భూక్యా శ్రీహర్ష, మర్లకుంటకు చెందిన కంచర్ల ఫిలిప్‌వర్మ సీట్లు సాధించారు. వీరిని గాయత్రి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు గునుకుల ఈశ్వరరావు అభినందించారు.

రింగ్ రోడ్డుకు కొత్త శోభ

తల్లాడ: తల్లాడ రింగ్ రోడ్డులో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తల్లాడ రింగ్ రోడ్ సెంటర్‌ను తల్లాడ ఎంపీడీఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎంపీఓ కె.శ్రీదేవి, ఈఓ మహేష్, ఈజీఎస్ ఏపీఓ కోటయ్య, సిబ్బంది రింగ్ రోడ్డును సుందరంగా తీర్చి దిద్దే పనిలో నిమగ్నమయ్యారు. రింగ్ లోపల వివిధ రకాల పూల మొక్కలను నాటడంతో పాటు రింగ్ వెలుపల ఉన్న డివైడర్లపై వివిధ రకాల పూల మొక్కల కుండీలను ఏర్పాటు చేయడంతో రింగ్ రోడ్డుకు కొత్త శోభ సంతరించుకుంది.

భరోసా ఇవ్వాలి

తల్లాడ: ఈ నెల 19న తెలంగాణ కౌలు రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తెలిపారు. శనివారం మండలంలోని కేశ్వాపురం గ్రామంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు తెలంగాణా కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, కార్యదర్శి తీగల సాగర్, కౌలు రైతుల రాష్ట్ర కన్వీనర్ వి.వెంకటేశ్వర్ రావు తదితరులు హాజరవుతారన్నారు. నాయకులు సత్యనారాయణరెడ్డి, రామలింగేశ్వరరావు, రామారావు, అమరేంద్ర, ఆదినారాయణ, నాగేశ్వరరావు, రవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం సీఐటీయూ మండల కన్వీనర్ ఎలగం కృష్ణ అధ్యక్షతన సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, లక్ష్మణ్‌రావు, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని వెంగళరావునగర్‌లో గల శ్రీభ్రమరాంబిక సమేత శ్రీమల్లికార్జునస్వామి ఆలయం 11వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకాలు, రుద్రహోమం, మహానివేదన, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు రెండువేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు రామడుగు గురుబ్రహ్మాచార్యులు, పద్మ, కమిటీ సభ్యులు కొలిపర బాబురావు, బాలాజీ, శ్రీనివాసరావు, మొగధంపురం నర్సింహాచారి, శరత్, శంకర్, సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సన్మానం

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలోని డీసీసీబీ బ్రాంచ్‌లో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న అధికారులు కొండా మహేష్‌కుమార్, అప్పిరెడ్డి త్రివేణిలను గ్రామపెద్దలు శనివారం శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ చైతన్య, సిబ్బంది లావణ్య, నాగేశ్వరరావు, చింతకాని, నాగులవంచ సొసైటీల సీఈఓలు వై.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, నాగులవంచ సొసైటీ చైర్మన్ శేషగిరిరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విడి విత్తనాలు కొనుగోలు చేయొద్దు..

వైరా/కొణిజర్ల: గ్రామాలకు వచ్చి విడిగా అమ్మే పత్తి, ఇతర పంటల విత్తనాలు ఎవరు అమ్మినా రైతులు కొనుగోలు చేయొద్దని.. వీటి వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందని వైరా ఏడీఏ కరుణశ్రీ సూచించారు. వైరా, కొణిజర్లలోని విత్తన దుకాణాలను శనివారం ఆమె తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ నుంచి గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే, బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని చెప్పారు. కాగా,దుకాణదారులు మేలైన విత్తనాలను అమ్మడంతో పాటు పూర్తి వివరాలతో రశీదు ఇవ్వాలని తెలిపారు. కొన్ని విత్తనాలే మంచివని చెబుతూ కొరత పేరుతో బ్లాక్ చేసినా, ధరలు పెంచినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదే సమయాన రైతులు ఒకే రకం అపోహలు విడనాడి ప్రభుత్వం అనుమతించిన ఏ విత్తనాలైనా కొనుగోలు చేయొచ్చని ఏడీఏ తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఓ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.